అమృత్ కిరణ్ కథలపోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

# ఎంత వింత ప్రేమ ఇది!



-గుజ్జేటి గణేష్

ఆమె మామూలు వనిత!

సామాన్య స్త్రీ!!

దౌర్భాగ్యపు ఆడది!!!

ఆమె పువ్వులా సుకుమారమైనది!

హిమ పర్వత శిఖరాగ్రం మీది స్ఫటికంలా స్వచ్ఛమైనది!

గగనంలోని తారలా మచ్చలేనిది!

అయినా, స్వతహా ఆమె యుక్తాయుక్తాలను పూర్ణంగా బేరీజు వేయలేని జ్ఞానహీనురాలు!

అందాన్ని గూర్చి ముఖ స్తుతి చేస్తే సంతోషంతో ఆకాశమంత ఎదగిపోయే గాలిబుడగ!

అసహ్యంతో అణగ ద్రొక్కితే కుళ్ళి కుళ్ళి రోదించే శోకదేవత!

అలాంటి మనస్తత్వాన్ని పుణికి పుచ్చుకున్న ఆమె ఒకానొక అపరాత్రి వేళ మోసపోయింది!

"అబ్బా... నీ అందం ముందు రంభా ఊర్వశిలు ఏపాటి" అన్న మాటలకు ఉబ్బి తబ్బిబ్బయింది!

"నీలాంటి అందగత్తె ఈ ప్రపంచంలోనే లేదు" అన్నప్పుడు గర్వంగా తలెత్తి చూసింది!!

ఆ సమయంలో ఆమె మెదడు మొద్దు బారి పోయింది. పవిత్రత ఎక్కడికో పారిపోయింది.

అందుకే, అది మోసం, దగా, వంచన అని గ్రహించ లేకపోయింది.

కన్నెపిల్ల ఏ జారుడు మెట్టుపై అడుగుపెడితే పతనమౌతుందో...సరిగ్గా ఆ జాగుడు మెట్టుపై నించి జారింది.

అది ఆమె యొక్క ఆవేశమో అమాయకత్వమో కానీ, అదఃపాతాళానికి చేరుకుంది.

ఈ కుళ్ళు సమాజం ఆడది ఏది పోగొట్టుకుంటే, అపవిత్రురాలు, కులట, చెడిపోయింది అంటూ వెంట బడి తరుముతుందో...దాన్నే...ఆ శీలాన్నే పోగొట్టుకుంది.

వైజ్ఞానికంగా ముందుకుపోతోన్న సమాజం అజ్ఞానంగా వెంటపడి తరిమినట్టే...విధి కూడా ఆమె పట్ల చిన్న చూపు చూసి జీవితాంతం మరిచిపోలేని శిక్ష విధించింది.

కాకతాళీయంగా జరిగిన సంఘటనకు ఫలితంగా తల్లిని చేసింది. మోసం, దగా, వంచనల ప్రతీకగా పాప భారాన్ని ఆమె కడుపున పడవేసింది.

అయినా, ఆరంభం పుట్టిన చోట అంతం కూడా పుట్టినట్టే, కడుపులో బిడ్డ దినదినాభివృద్ధి చెందినట్టు ఆమె జ్ఞాన జిజ్ఞాసలు కూడా మెరుగు దిద్దుకొని ఊపిరి పోసుకున్నాయి.

అందుకే, తనకు జరిగిన అన్యాయానికి యావత్ ప్రపంచాన్ని దూషించింది.

సమాజం పట్ల అంతవరకున్న గౌరవం, ఆకర్షణ, ప్రేమా ఒక్కపెట్టున అంతరించి పోయాయి. వాటిస్థానే పగ, ప్రతీకారం, ఏవగింపు చోటు చేసుకున్నాయి.

హఠాత్తుగా గత దినాల స్మృతులు స్ఫురణకొచ్చి ఆమె పెదవులపై చిన్న భావగర్భిత చిరునవ్వు తళుక్కున మెరిసి మాయమైంది.

అయినా, మస్తిష్కం ఎంతో యుక్తిగా ఆలోచించ సాగింది.

ఎన్నో ఆలోచనలు!

మరెన్నో నిర్భేద్యమైన ప్రతీకార భావాలు!!

ఆమెలో నిద్రాణమై ఉన్న న్యాయం, ధర్మం, సంస్కారం విశ్వరూపం దాల్చి ఆమెను వివశురాల్నిచేసి ప్రతీకారం తీర్చుకొమ్మని వొత్తిడి చేయసాగాయి.

అయినా ఆవేశాన్ని అణచిపెట్టి - 'త్వరపడకూడదు. ఈ సమాజంపై తాను సంధించబోయే విల్లు వివేకంతో, ఉండాలి. అంతేగాని, తొందరపాటు, ఆవేశం,రగడ ఉండకూడదు.' అని మనస్సుకు స్వాంతనవచనాలు చెప్పుకుంది.

మనస్సు నిగ్రహించుకొని తగిన సమయం కోసం నిరీక్షించింది.

★ ★ ★

ఆమె అతని వంక చూడకుండానే

"వచ్చి ఈ సోఫాలో కూర్చోండి" అంది.

ఆమె మాట విని అతను చిన్నగా ఉలిక్కిపడ్డాడు. ఆ స్వరం తనకు పరిచయమునట్లూ, ఎక్కడో ఎప్పుడో విన్నట్లూ అనిపించింది. మెల్లగా వచ్చి ఆమె చూపిన సోఫాలో కూర్చున్నాడు.

అతను మెల్లగా "ఐదొందలు" అన్నాడు.

ఆమె "ఆఫ్ట్రాల్.... ఐదు వందలే పట్టుకొని వచ్చారా?" వ్యంగ్యంగా అంటూ తిరిగి అతని వంక తీక్షణంగా చూసింది.

ఆమెను చూస్తూనే అతని వొళ్ళు జల్లుమంది. నుదుటిపై స్వేదం పేరుకుపోయింది.

లో గొంతుకతో "ప్రమీలా...నువ్వా? ఇంత గొప్ప స్థానంలో..." అంటూ ఆగిపోయాడు.

ఆమె అతని వంక వెటకారంగా చూసి "ఔను... నేనే సుధీర్! నీ మాయ మాటలు నమ్మి, నీ మొసలి కన్నీరుకు ప్రలోభపడి, నీ వల్లో చిక్కుకొని...నీచేత వంచింపబడ్డ ఆ ప్రమీలనే...అ...అ...నేనే! ఇక ఏం వ్యాపారం చేస్తున్నానంటావా?.... నా కూతురి శరీరాన్ని అమ్ముతున్నాను. నీలాంటి ఖరీదైన మనుషులకు నా కూతురి శరీరాన్ని తాకట్టుపెట్టి సొమ్ముచేసుకొని...ఇంత గొప్ప స్థానంలో ఉండి సుఖంగా బ్రతుకుతున్నాను."

సుధీర్ ఆమె మాటలకు అడ్డుపడి "నువ్వు పెళ్ళి చేసుకున్నావా?" ఆతృతగా అడిగాడు.

"లేదు... అయినా... నాపెళ్ళి నీతోనే జరిగాక ఇంకా...మరో పెళ్ళి ఎలా చేసుకుంటాను?" ఎదురు ప్రశ్నించింది.

ఆ ప్రశ్నవిని షాక్ తగిలినట్టు సోఫాలోంచి లేచి నిలబడి "నాతోనా....?" విస్మయంగా అడిగాడు.

"ఔను!" అతని వంక నిర్లక్ష్యంగా చూస్తూ ధీమాగా అంది ప్రమీల- "నీతోనే జరిగింది! అయినా...నీ దృష్టిలో కాకపోవచ్చు! కాని... నా శరీరంపై అధిపత్యం చెలాయించి నన్ను చెరిచిన నువ్వే... నువ్వే నా భర్తవు!"

"అది పెళ్ళికాదు" ఆవేశంగా అన్నాడు సుధీర్.

"నువ్వు ఔనన్నా కాదన్నా నా దృష్టిలో... నా పెళ్ళి



నితోనె జరిగింది. అంతేకాదు.... నువ్వు క్షణికావేశంతో నన్ను చెరిచి నీ కామవాంఛ తీర్చుకున్నందుకు ప్రతీకగా... నీ ప్రతి రూపం నా కడుపున రూపుదిద్దుకుంది. ఆ నీ ప్రతి రూపాన్నే... నీ రక్తాన్నే తాకట్టు పెట్టి జల్సాగా బ్రతుకుతూ నా ప్రతీకారం తీర్చుకుంటున్నాను." గంభీరంగా చెప్పింది ప్రమీల.

ఆమె మాటలు వింటూనే సుధీర్ నవనాడులు కృంగిపోయాయి. "అంటే...?" అని గాబరాగా అడిగాడు.

"ఆశ్చర్యపోకు సుధీర్.. నాలో రూపు దిద్దుకున్న నీ ప్రతి రూపాన్ని రక్తపు గుడ్డులోనే కడతేర్చాలనుకున్నాను. కానీ, నీపై ఎక్కుపెట్టిన నా ప్రతీకార ప్రణాళిక నన్ను ఆ పని చేయనివ్వలేదు. నీ కళ్ళముందే.... నీ రక్తాన్ని అడ్డు పెట్టుకొని...సొమ్ము చేసుకుంటూ నీ హృదయాన్ని చిత్రవధ చేయాలన్న కౄరసంకల్పంతో... నీ బిడ్డను చంపకుండా పెంచాను. ఇప్పుడు దాని అందాన్ని ఎరగా బెట్టి లక్షలు సంపాదిస్తూ నా ప్రతీకారం తీర్చుకుంటున్నాను." అంది ప్రమీల.

ఆమె మాటలు విన్న సుధీర్ హృదయాంతరాల్లో హఠాత్మార్పు!

మనస్సు పొరల్లో చిన్న కదలిక!

మాటల కందని మమతాను రాగం!

అంతే! అప్రయత్నంగా "ప్రమీలా! నన్ను క్షమించూ!" అన్నాడు సుధీర్.

అతను కాళ్ళబేరానికొచ్చాడని గ్రహించడానికి ప్రమీలకు ఎంతో సేపు పట్టలేదు.

"నేనా... నిన్ను నేను క్షమించాలా!?" ఆశ్చర్యం అభినయిస్తూ అంది.

"అవును ప్రమీలా! నన్ను క్షమించి...నాతో పాటు నా కూతుర్ని... సారీ... మన కూతురికి విముక్తి కలిగించు"

"అది మాత్రం జరగని పని"

"అలా అనకు ప్రమీలా! నీలో ఇంకా కక్ష మిగిలి

ఉంటే... నాపై ప్రతీకారం తీర్చుకో... నన్ను చంపు! అంతే కానీ. నా మూలంగా ఏ పాపమెరుగని ఆ పసిదాన్ని బలిచేయకు."

"భేష్...! కడుపులో మొలకై మొలిచింది తెలీకుండానే. ఊపిరి పోసుకొని భూమిపై పడ్డది తెలీకుండానే. ఎలా పెరిగి పెద్దయిందన్న ఆలోచన లేకుండా... ఉన్న పళంగా నీరక్తం. నీకూతురు అని చెపుతూనే ఇంత పరితపించి పోతున్నావంటే నీలో మానవత్వం ఉందన్న మాట!" అతని కళ్ళలోకి సూటిగా చూస్తూ అంది.

ఆమె మాటలో ద్యోతకమైన వ్యంగ్యాన్ని పసిగట్టలేక పోయాడు సుధీర్.

"నేనే కాదు ప్రమీలా! బిడ్డకు జన్మనిచ్చిన ప్రతీ తండ్రీ..."

అతని మాటల్ని మధ్యలోనే తృంచి "స్టాపిట్ సుధీర్! గంభీరంగా అంది ప్రమీల.

" ఆ మాట మాట్లాడే అర్హత నీకులేదు. "అంతటి మానవత్వం ఉన్నవాడివే అయితే... నన్ను మోసగించి నా పతనానికి కారకుడవయ్యే వాడివే కాదు. కామవాంఛ ఫలితంగా కడుపున పడ్డ నీ కూతురి గురించి నువ్విప్పుడు ఇంతగా తల్లడిల్లిపోతూ నీతి మాటలు మాట్లాడుతున్నావే...

మరి... అన్యోన్యమైన కలయికతో ఎంతో అపురూపంగా పుట్టి... పువ్వులా పెరిగిన నా గురించి... నా గురించి... నా తల్లిదండ్రులు ఎంతటి గుండె కోతను అనుభవించారో ఆలోచించావా?

లేదు... అది నీకు అక్కర్లేదు. కానీ.. నీ కూతురు ... క్షణికావేశంతో పుట్టిన నీ-కూతురు మాత్రం నరకం అనుభవించొద్దు! విముక్తి కావాలి! సుధీర్... నువ్వొక్కడివే కాదు ... ఈ సమాజ నైజమే అంత... కొంప కాలుతుందంటే వాసాలు ఏరుకునే రకం!"




"మీ వాచీ సరైన టైమ్ చెప్తుందా?" అని అడిగింది. కమల, శ్యామలని.

"చెప్పదు, మనం చూసుకోవలసిందే!" చెప్పింది శ్యామల.

-బి.సుజన్‌రాజా
ఇ.నం.3-8-17, రేచర్లపేట,
కాకినాడ - 533 003.

ప్రమీల అన్న మాటలు సుధీర్‌పై ఎంత ప్రభావం చూపాయే లేదో కాని. ముందు అతని హృదయాంతరాల్లో కూతుర్ని చూడాలన్న ఉత్సుకత. తనివి తీరా స్పృషించి గుండెలకు హత్తుకోవాలన్న ఆరాటం ఉరకలెత్తాయి. అతను అచ్చటికి ఎందుకొచ్చాడో కూడా మరిచిపోయాడు.

హఠాత్తుగా కళ్ళు అశ్రుపూర్ణాలై మసకబారాయి. క్షణమైనా నిలవకుండ ప్రమీలను సమీపించి. ఆమె చేయి పుచ్చుకొని

"ప్రమీలా! ఇవి చేతులు కావు... దయచేసి నా చిట్టి తల్లిని చూపించు " అన్నాడు.

అతని కళ్ళ నుండి నీళ్ళు జలజలా రాలి ఆమె చేయిని తడిపాయి.

అతని వాలకం చూసి ప్రమీల మనస్సుచివుక్కుమంది! అంతరంగంలో ఏదో అలజడి! కడతేరిన క్షమా హృదయం కొత్త ఊపిరిని పోసుకుంది! అంతలోనే అతనిపై వింత జాలి కలిగింది!

ఆ జాలి మూలంగా నిద్రాణమైన వాస్తవాలు మేల్కొన్నాయి.

అందుకే నిజాన్ని దాచలేకపోయింది...

"మీతో చెప్పినట్టు అమ్మాయి శరీరాన్ని తాకట్టుపెట్టి. దాని శరీరంతో వ్యాపారం చేసి ఈ ఆస్తి అంతస్థులు సంపాదించలేదు. ఇది నా వొళ్ళమ్ముకొని కూడ బెట్టిన సొత్తు"

"ఏంటీ....?" అంటూ ఆశ్చర్యంగా అడిగాడు సుధీర్.

"ఔను! మీ చేత వంచింపబడిన నేను మీపై ఓ విధమైన పంతంతో మొండిగా బ్రతకాలనుకున్నాను.

కానీ... ఈ సమాజం నన్ను చిన్న చూపు చూసింది.నాపై దుమ్మెత్తి పోసింది. 'చెడిపోయింది' అన్న బోర్డు నా మెడకు తగిలించి నన్ను వెలేసింది.

సూటిగా చెప్పాలంటే పరోక్షంగా నన్ను ఈ వృత్తిలోకి దింపింది కూడా ఈ కుళ్ళు సమాజమే!

అందుకే విధిలేక ఈ నిర్ణయానికి వచ్చాను!

ఈ నా నిర్ణయం బహుశా తోటి ఆడ జాతికి కోపం కలిగిస్తుండవచ్చు! అయినా, అప్పటి నా దీన పరిస్థితిలో నాకు ఇంతకంటే మంచి మార్గం కనిపించలేదు.

అందుకే, నా శరీరాన్ని కోటీశ్వరులకు తాకట్టుపెట్టాను. వారు నేను కోరినంత డబ్బు వెదజల్లారు... సుఖంగా బ్రతకడం నేర్పారు. నాది ఆత్మవంచనే కావచ్చు. అయినా నా మట్టుకు తప్పలేదు మరి."


"మరి... అమ్మాయి?"

"ఊహ తెలిసే వరకు... అక్కడ పంజరంలో వ్రేలాడుతున్న చిలకలా మురిపెంగా పెంచాను. ఆ తర్వాత నా నీడ సోకొద్దన్న నిర్ణయంతో చదువు వంక బెట్టి నాకు దూరంగా ఉంచాను.

ఇప్పుడు అది మద్రాస్‌లో హౌస్ సర్జన్ చేస్తోంది. దాని చదువు పూర్తయితే నా లక్ష్యం నెరవేరుతుంది. అనుకున్నది సాధించానన్న తృప్తితో నిశ్చింతగా కన్ను మూస్తాను" అని చెప్పి తెలిగ్గా నిట్టూర్చి సోఫాలో వెనక్కి వాలింది ప్రమీల.

ఆమె మాటల్లో ప్రస్ఫుటమైన కార్య దీక్షనూ. లక్ష్య సాధననూ, విజయోత్సాహాన్నీ గ్రహించిన సుధీర్ నోట వెంట మరో మాట పెగిలి రాలేదు.

-గుజ్జేటి గణేష్
కండక్టర్ ఇ.నం.302252.
ఏపిఎస్ఆర్‌టిసి.
ఆర్మూర్ - 503 224.




నానక్‌సింగ్, ఇ.నం.9-4-66, బురుడ్‌గల్లి, నిజామాబాద్.